## క్లుప్తంగా

### జిల్లా చెస్ పోటీల్లో ఇద్దరికి పతకాలు



పెనమలూరు: జిల్లా చెస్ పోటీల్లో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించారు. కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పోతిన రఘు బుధవారం వివరాలు తెలుపుతూ కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్‌లో ఇటీవల నిర్వహించిన పోటీల్లో తమ కాలేజీ విద్యార్థి బి.రుతిక్‌సాయి ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 31వ తేదీన రాజమండ్రిలో జరిగే రాష్ట్ర పోటీల్లో జిల్లా జట్టు నుంచి పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో రుతిక్‌సాయితో పాటు జస్వంత్ ఉత్తమ ప్రతిభ చాటి పతకాలు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ అభినందించారు.

### రేమల్లెలో చెరకుతోట దగ్ధం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం రేమల్లెలో అగ్ని ప్రమాదానికి గురై చెరుకు తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన యనమదల సాంబశివరావుకు చెందిన రెండున్నర ఎకరాల చెరుకుతోటలో ఆకస్మాత్తుగా మంటలు వ్యాప్తి చెందటంతో రైతులు హుటాహుటిన అప్రమత్తం అయ్యారు. మంటలు ఆర్పేందుకు యత్నించిన ఫలితం లేకపోయింది. సుమారుగా రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు రైతు సాంబశివరావు వాపోయారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

### నున్నలో తాగునీటి చెరువులకు నీరు సరఫరా



నున్న (విజయవాడరూరల్): నున్న గ్రామంలో తాగునీటి చెరువుల్లో నీరు తగ్గుముఖం పట్టడంతో గొల్లపూడి పంపింగ్ స్కీమ్ నుంచి మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నున్నలో గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక వైపు గల రెండు చెరువుల్లో నీరు తగ్గడంతో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేకంగా 10 హెచ్‌పీ సామర్థ్యం గల 5 మోటార్లు ఏర్పాటు చేసి గొల్లపూడి పంపింగ్ స్కీమ్ నుంచి నీటిని తోడుతున్నారు. గొల్లపూడి - ముస్తాబాద పంట కాల్వ ద్వారా వచ్చే ఆ నీటిని నున్న గ్రామంలో తాగునీటికి మళ్లిస్తున్నారు. నున్న గ్రామంలో ప్రతి రోజు లక్ష లీటర్ల తాగునీరు వినియోగం జరుగుతుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. గ్రామస్తుల అవసరాలకు తగిన విధంగా నీటి సరఫరా చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

### నున్నలో 48 మందికి వైద్య పరీక్షలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ సచివాలయం - 2 వద్ద 104 ఉచిత వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. గర్భం దాల్చే అంశంలో బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం 3 సంవత్సరాల దూరం ఉండాలన్నారు. దీని వల్ల తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ ప్లానింగ్ టాబ్‌లెట్స్ ఉపయోగించాలన్నారు. రక్తహీనత కల్గిన వారికి ఐరన్ టాబ్లెట్స్ అందజేశారు. అదే విధంగా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు డైట్ మెయింటెనెన్స్ తప్పక పాటించాలన్నారు. ప్రతి రోజూ వాకింగ్ చేయాలని, డాక్టర్లు సూచించిన మేరకు డైట్ పాటించాలన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. నోడల్ ఆఫీసర్ మోతిబాబు రికార్డులను పరిశీలించారు.

### 20న స్మారకోపన్యాసం

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు దేశ సమైక్యత-ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బీవీ రాఘవులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

# రూరల్‌లో పెరిగిన పోలింగ్ శాతం

- మహిళల ఓట్లే అధికం
- సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల స్పందన
- గెలుపు, ఓటములపై పార్టీల అంచనాలు



పోరంకిలో ఓటు వేసేందుకు క్యూలో వేచి ఉన్న మహిళా ఓటర్లు(ఫైల్)

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో అర్బన్ ఓట్ల కన్నా రూరల్‌లో ఓట్ల పోలింగ్ శాతం అధికంగా నమోదైంది. నియోజకవర్గంలో తాడిగడప మున్సిపాలిటీ అర్బన్‌గా ఉండగా కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాలు రూరల్‌గా ఉన్నాయి. పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం 2,94,928 ఓట్లు ఉన్నాయి. అందులో తాడిగడప మున్సిపాలిటీలో 1,37,299 ఓట్లు ఉన్నాయి. అయితే ఈ ఎన్నికల్లో తాడిగడప మున్సిపాలిటీలోని యనమలకుదురు, కానూరు, పోరంకి, తాడిగడప ప్రాంతాలలో మొత్తం 98,957 ఓట్లు పోల్ అయ్యాయి. కానూరులో 34,221 ఓట్లు, యనమలకుదురులో 28,331 ఓట్లు, తాడిగడపలో 14,498, పోరంకిలో 21,927 ఓట్ల చొప్పున పోల్ అయ్యాయి. అర్బన్ ఓట్ల శాతం 72.07గా నమోదైంది.

**రూరల్ ఓట్లు ఇలా..**

ఇక రూరల్‌లో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. ఉయ్యూరు నగర పంచాయతీతో కలుపుకోని వివరాలు ఇలా ఉన్నాయి. పెనమలూరు మండలంలో మొత్తం ఓట్లు 39,018 ఉండగా 32,747 ఓట్లు 83.92 శాతం పోల్ అయ్యాయి. కంకిపాడు మండలంలో 55,410 ఓట్లు ఉండగా 48,077 ఓట్లు 86.77 శాతం, ఉయ్యూరులో 63,201 ఓట్లు ఉండగా ఎన్నికల్లో 53,571 ఓట్లు 84.76 శాతం పోల్ అయ్యాయి. అర్బన్‌లో పోల్ అయిన మొత్తం ఓట్లు 98,957 ఉండగా రూరల్‌లో 1,34,395 ఓట్లు పోల్ అయ్యాయి. రూరల్ ఓట్లు అధికంగా పోలింగ్ కావడంతో గెలుపుపై ఆయా పార్టీల వారు అంచనాలు వేస్తున్నారు.

**మహిళా ఓట్లు అధికం**

పెనమలూరు నియోజకవర్గంలో పురుషుల ఓట్లు 1,42,349, మహిళల ఓట్లు 1,52,577 ఉన్నాయి. అయితే ఎన్నికల్లో పురుషులు 1,13,418 ఓట్లు, మహిళలు 1,19,933 చొప్పున పోల్ అయ్యాయి. పురుషుల కంటే మహిళలు 6,515 మంది అధికంగా ఓట్లు వేశారు. ట్రాన్స్ జండర్ (టీజీ)1 ఓటు పడింది. అభ్యర్థి గెలుపునకు మహిళా ఓట్లే కీలకంగా ఉన్నాయి. కాగా అర్బన్ కంటే రూరల్‌లో ఓట్లు ఎక్కువగా వేయటం, దీనికి తోడు మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు అధికంగా ఉపయోగించుకోవటంతో గెలుపుపై ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి. రూరల్ ఓట్లు, మహిళల ఓట్లు తమకే పడతాయని వైఎస్సార్ సీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాల కారణంగానే రూరల్‌లో ఓట్లు ఎక్కువగా నమోదు అయ్యాయని అంచనా వేస్తున్నారు.

# పెనమలూరులో వారి నిర్ణయమే కీలకం

- గెలుపును నిర్దేశించేది ఆ ఓటే
- ఎవరికి లాభమో చర్చించుకుంటున్న నేతలు

కంకిపాడు: అభ్యర్థుల గెలుపు ఓటములపై తీవ్ర స్థాయిలో చర్చ సాగుతోంది. గెలుపు ఓటములను నిర్ణయించే శక్తిగా మహిళలు, వృద్ధులు, యువత ఉన్నారు. దీంతో వారి నిర్ణయం కీలకంగా మారనుంది. వారి మద్దతు ఏ పక్షాన్ని వరించిందన్న అంశంపై ప్రధాన రాజకీయ పక్షాలు లెక్కలు కడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా 2,94,928 మంది ఓటర్లు ఉన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి జోగి రమేష్, టీడీపీ నుంచి బోడె ప్రసాద్‌తో పాటుగా మరో తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నెల 13న పోలింగ్ పూర్తి కావటంతో ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయానికి తరలించారు.

**ఎవరెటు...**

నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 1,52,577 మంది ఉండగా 1,19,969 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో అత్యధికులు డ్వాక్రా మహిళలు, వృద్ధులు ఉన్నారు. యువ ఓటర్లు, కాలువ కట్ల ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటెత్తారు. ముస్లిం మైనార్టీ వర్గాలు కదిలివచ్చాయి. బీజేపీ ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని చేసిన ప్రకటన నేపథ్యంలో వారి తీర్పు కూడా కీలకంగా మారింది. మహిళలు, వృద్ధులు, యువత ఎవరికి మద్దతు ఇచ్చారో వివరాలను సేకరించే పనిలో నేతలు పడ్డారు. ఇప్పటికే ఆయా పార్టీలు గ్రామాలు, బూత్‌ల వారీగా పోలింగ్ సరళిపై సమీక్షలు మొదలుపెట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు, వృద్ధుల మద్దతు పూర్తిగా వైఎస్సార్ సీపీకే ఉంటుందని ప్రజాతంత్ర వాదులు భావిస్తున్నారు. ముస్లిం మైనార్టీలు కూటమికి మద్దతు ఇచ్చే పరిస్థితి ఉండదనే వాదన కూడా వినిపిస్తోంది. దీంతో యువత, మహిళలు, ముస్లింల నిర్ణయం ఎటు పక్షాన అన్న దానిపై నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. టీడీపీ మాత్రం రెండు సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లే లక్ష్యంగా పోలింగ్ ప్రక్రియపై దృష్టి పెట్టారు. ఆ వర్గాలతో పాటుగా ప్రజామద్దతు ఏమేరకు ఉందో అంచనాలు వేస్తున్నారు. ఇదిలా ఉంటే మరో వైపు పోలింగ్‌కు రాని ఓటర్ల వివరాలను సేకరించి ఎందుకు ఓటు వేయలేదో తెలుసుకునే పనిలో ఉన్నారు. ఆయా పక్షాలను మెప్పించలేకపోవటానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఏది ఏమైనా ఓటరు నిర్ణయం మాత్రం ఈవీఎంలలో భద్రంగా ఉంది. జూన్ 4 వరకూ ఫలితం కోసం వేచి ఉండాల్సిందే.



పునాదిపాడులో ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు(ఫైల్)

## వంశీమోహన్‌ను కలిసిన పార్టీ శ్రేణులు



వంశీమోహన్‌ను కలిసిన నాయకులు

గన్నవరం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను బుధవారం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు కలిశారు. స్థానిక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన అందుబాటులో ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామ పార్టీ నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పోలింగ్ సరళిని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గత ఎన్నికల కంటే అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశారు. తన కోసం పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నేతలు సమన్వయంతో కష్టపడి పని చేయడం పట్ల వంశీమోహన్ ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా పలు గ్రామాల నుంచి ప్రజలు వంశీమోహన్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు.

**మల్లేశ్వరికి నివాళులు..**

అల్లాపురం మాజీ సర్పంచి అనగాని కామేశ్వరరావు కుమార్తె, ఎంపీపీ అనగాని రవి సోదరి కోరుకొప్పుల మల్లేశ్వరి బుధవారం కన్నుమూశారు. బుద్దవరం శివారు దాసులపాకల వద్ద జగనన్న కాలనీలోని స్వగృహం వద్ద మల్లేశ్వరి భౌతికకాయానికి వల్లభనేని వంశీమోహన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె సోదరుడు అనగాని రవి, కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### ఆలయ భూముల కౌలు వేలం వాయిదా

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూములు సాగు కౌలు బహిరంగ వేలం పాట వేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.మోహన్‌రావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ తాడిగడప గ్రామంలో ఆర్ ఎస్ నంబర్ 133లో 8.72 ఎకరాల వ్యవసాయ భూమి సాగు హక్కు 2024-2027 వరకు మూడేళ్లకు టెండర్ కం బహిరంగ వేలం బుధవారం ఆలయ ఆవరణలో నిర్వహించగా ఎవ్వరు ముందుకు రానందున వాయిదా వేశామన్నారు. తదుపరి వేలం తేదీ త్వరలో ప్రకటిస్తామని ఈవో మోహన్‌రావు చెప్పారు.

### సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల విక్రయం

విజయవాడరూరల్: రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో విక్రయిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ, జనుము 10 కేజీల బ్యాగ్ 440 రూపాయలకు, పిల్లి పెసర 8 కేజీల బ్యాగ్ 670 రూపాయలుగా ధర నిర్ణయించారన్నారు. ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తామని చెప్పారు. విజయవాడ రూరల్ మండలానికి 215 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు వచ్చాయని రైతులు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి కొనుగోలు చేయాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగా వరి పండించే భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలను సాగుచేసి కలయదున్నడం వలన భూమిలో సేంద్రియ పదార్థం తయారవుతుందన్నారు. పిమ్మట వరి పంట పంటసాగు చేయడం వలన పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఏవో తెలిపారు.

## నైపుణ్యాలకు మెరుగులు



వేసవి శిక్షణలో చిన్నారులు



డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులు తయారు చేసిన హ్యాండీక్రాఫ్ట్‌లను చూపిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో అన్న సంతర్పణ సమితి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా కొనసాగుతున్నాయి. వేసవి ఎండలలో చిన్నారులు బయట తిరగకుండా వారిలోని నైపుణ్యాలను పెపొందించుకునే విధంగా పలు విభాగాల వారీగా వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఏటా ప్రముఖ రిసోర్స్ పర్సన్‌లతో అన్న సంతర్పణణ సమితి ట్రస్ట్ ఉచిత వేసవి శిక్షణ ఇస్తున్నారు. యోగ, క్రాఫ్ట్ వర్క్, చిత్రలేఖనం, వెస్ట్రన్ అండ్ ఫోక్ డ్యాన్స్‌లను చిన్నారులకు నేర్పిస్తున్నారు. ఆసక్తి, సృజనాత్మకతను గుర్తించి వాటిని మెరుగులు దిద్దేందుకు కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు గుండు దిలీప్ తెలిపారు. వేసవి సెలవుల్లో సమయం వృథా కాకుండా చిన్నారులకు నచ్చిన అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వటం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో సుమారు 150 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకుంటున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్ ఫీడర్‌లో గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చింతలపేట, రామ్‌నగర్, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ ఏరియా, ఇస్లాంపేట, కొత్తపేట, పాత గన్నవరం, చెంచులకాలనీ, శేషసాయి గార్డెన్, బీబీ గూడెం, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, ఆశ్రమం ఏరియా, చిక్కవరం, స్లేట్ స్కూల్ ఏరియా, గొల్లనపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

**రామవరప్పాడు పరిధిలో..**

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటుతో గ్రామంలోని పటేల్‌నగర్, సాయి నగర్, హనుమాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లై ఓవర్ దిగువ ప్రాంతం, రైల్వేస్టేషన్ కట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

## ప్రారంభమైన పాండురంగడి బ్రహ్మోత్సవాలు



ఎదుర్కోలోత్సవంలో స్వామి



ఎదుర్కోలోత్సవంలో రుక్మాబాయి అమ్మవారు



ప్రత్యేక అలంకారంలో పాండురంగడు, వేణుగోపాలుడు ధృవమూర్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కొత్తగుళ్ల ప్రాంగణంలో కొలువై ఉన్న పాండురంగడి సన్నిధిలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి ఆలయంలో ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఉదయం ఆలయంలోని రుక్మాబాయి సమేత పాండురంగడకు ప్రత్యేక తిరుమంజన అభిషేకాన్ని నిర్వహించారు. అందులో భాగంగా పంచామృతాలు, పలు ఫల, విశేష జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారునిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం హంసవాహనంపై స్వామి వారికి వాహనసేవను జరిపారు. అనంతరం ఎదుర్కోలోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అందులో భాగంగా శేషవాహనంపై స్వామి వారిని అధిష్టింపజేశారు. అనంతరం స్వామివారు, అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ ఉత్సవాన్ని జరిపారు. పాండురంగ భజన మండలి ఆధ్వర్యంలో రాత్రి సంకీర్తనగానం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను అద్దేపల్లి మురళీకృష్ణమాచార్యులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

# పీహెచ్‌సీల్లో అత్యాధునిక వసతులు

- అందుతున్న నాణ్యమైన వైద్య సేవలు
- 64 రకాల పరీక్షలు, 102 రకాల మందులు అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



ఇందుపల్లిలోని పీహెచ్‌సీ నూతన భవనం

ఉంగుటూరు: గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో అభివృద్ధి, సంక్షేమం పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ భవనాలు, ఆరోగ్యకేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నుంచి విషపురుగులు సంచరిస్తుండంతో భయం, భయంగా డాక్టర్లు వైద్య సేవలు అందించేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత, సంక్షేమం, అభివృద్ధికి తొలి ప్రాధాన్యనిచ్చింది. నాడు - నేడు ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలలు, పీహెచ్‌సీలు కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశారు. ఉంగుటూరు మండలంలో రూ.4 కోట్లతో ఉంగుటూరు, ఇందుపల్లి పీహెచ్‌సీలను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేశారు. ఆస్పత్రిలో వైద్యాధికారుల గదులు 2, ఫార్మసీ, స్టాఫ్ నర్స్, ల్యాబ్, కాన్పుల గది, శస్త్రచికిత్స గది, పురుషులు, స్త్రీలకు విడి విడిగా వార్డు, వ్యాక్సినేషన్ రూమ్, ఆయూష్ డాక్టర్ గది, రికార్డుల భద్రపరచు గది, రిజిస్ట్రేషన్ గదులు అత్యాధునిక వసతులతో ఉంచారు. అదే విధంగా 102 రకాల మందులు, 64 రకాల పరీక్షలు, పాముకాటు, కుక్కకాటు వంటి అత్యవసర మందులు, 24 గంటల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



ఓపీ నమోదు కౌంటర్



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శిరీష



మందులు ఇస్తున్న సిబ్బంది

## సీబీఎస్‌ఈ ఫలితాల్లో సత్తా చాటిన నలంద

కంకిపాడు: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2023-24 విద్యాసంవత్సరంలో సీబీఎస్‌ఈ నిర్వహించిన పరీక్షల్లో 500 మార్కులకు టీ.గీతాశ్రీ 477 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గౌతమ్‌రెడ్డి 476, టి.దేవి శ్రీమహిమ 453, సీహెచ్ జాషువా 446, డి.సాయిశృతి 444 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కరస్పాండెంట్ విజయబాబు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది.

## ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం



పారాయణం చేస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీభగవాన్ షిరిడీ సాయిబాబా మందిరం 13వ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు సంధ్య హారతితో వేడుకలు ప్రారంభించారు. ఉదయం 6.30 గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం ఉదయం 9.00 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి ఏకనామం జరిగాయి. ఆలయ అర్చకులు వలివేటి శ్రీనివాస శర్మ పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వైవీ శివాజీ, మలిశెట్టి బాలవర్ధనరావు, ప్రసాద్, శ్రీనివాస్, పీవీఎల్ఎన్ రాజు, కోనేరు మంజులవాణి తదితరులు పర్యవేక్షించారు

## పటమటలో పోలీస్ బందోబస్తు



రామలింగేశ్వరనగర్ పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పటమట పోలీసులు

పటమట(విజయవాడతూర్పు): సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న అల్లర్ల నేపథ్యంలో విజయవాడ కమిషనరేట్ పరిధిలోని పటమట పోలీసులు కూడా స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తీసుకున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం పటమట స్టేషన్ పరిధిలోని నిడమానూరు, పటమట, రామలింగేశ్వనగర్, గురునానక్ నగర్ సెక్టార్‌లో పోలీసులు బుధవారం పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ స్టేషన్ ఎన్టీయార్ జిల్లా, కృష్ణా జిల్లాల పరిధిలో ఉండటం రెండు పార్లమెంటు, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉండటంతో పోలీసులు సున్నితమైన ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగకుండా పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు.